## బాధితులకు సహాయం

**చీపురుపల్లి:** పట్టణంలోని రుంకానవీధిలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు కుటుంబా లకు సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు తమవంతు సహాయం చేశారు. విద్యార్థులు అంతా కలిసి బాధిత కుటుంబాలకు రూ.5 వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు మంగళవారం అందజేశారు. ఇదే విషయాన్ని తెలుసు కున్న సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు అంతా కలిపి డబ్బులు పోగు చేసారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పాఠశాల కరస్పాండెంట్ వలిరెడ్డి పద్మ, హెచ్ఎం గవిడి భారతి, ముల్లు పైడిరాజు, ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నగదు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న విద్యార్థులు

## 30న క్రికెట్ టోర్నమెంట్

**గజపతినగరం రూరల్:** మండలంలోని సాలిపేటలో గ్రామ దేవత పైడితల్లమ్మ ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 30వ తేదీన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు ఆ గ్రామ మాజీ సర్పంచ్ నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు తమ వివరాలను 86889 72593, 89859 05608 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

## బీజేపీ సర్కారును సాగనంపాలి



ప్రచారభేరిలో సీపీఐ, సీపీఎం నాయకులు

**శృంగవరపుకోట:** మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే దేశంలో ప్రజల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని వామపక్షాల నేతలు ప్రచారభేరి కార్యక్రమంలో ధ్వజమెత్తారు. వామపక్షనేతలు కాపుసోంపురం, పెదఖండేపల్లి, రాజీపేట, బొడ్డవర గ్రామాల్లో మంగళవారం ప్రచారభేరిలో భాగంగా ఇంటింట ప్రచారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు అమ్మేస్తోందని, ప్రధాని మోదీ మతం ముసుగు కప్పుకుని పాలన సాగిస్తున్నాడని ఆరోపించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యవసర సరుకుల ధరలు నింగినంటుతున్నాయన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్ది కృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, సీపీఐ మండల కార్యదర్శి మోపాడ మధు, నాయకులు కె.భీముడు, వి.గోపి, ఎన్.నారాయణరావు, అచ్చింనాయుడు, బాలు, శ్రీను పాల్గొన్నారు.

## గుడివాడలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ధరణి

**వేపాడ:** మండలంలోని గుడివాడ గ్రామంలో వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి ఆధ్వర్యంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యాధికారి,104 సిబ్బంది కలిపి 42 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. ప్రజలకు ఆరోగ్యజాగ్రత్తలు సూచించారు. మధ్యాహ్నం గృహ సందర్శన చేసి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి వైద్య తనిఖీలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెచ్ఎస్ వెంకటరమణ, హెచ్ఏ సాయిరెడ్డి, ఏఎన్ఎం బి.లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య పాల్గొన్నారు.

# సచివాలయంలో కలెక్టర్ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

**చీపురుపల్లి:** స్థానిక వంగపల్లిపేటలోని సచివాలయం-3లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత గృహ హక్కు పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని, అర్హులందరికీ పథకాలు అందించడమే ధ్యేయంగా పని చేయాలని అన్నారు. సచివాలయం లో ఇంటర్నెట్‌తో పాటు ఇతర సాంకేతిక పరికరాల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ ఎం.అప్పారావు, డీఎల్‌డీఓ లక్ష్మణరావు, తహసీల్దార్ ఎం.సురేష్, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి తదితరులు ఉన్నారు.






















# ప్రజల వద్దకే పాలన

- కరోనా విపత్తులో సైతం పథకాలు అమలు
- గత ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు ఎందుకు రుణమాఫీ చేయలేదు..?
- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి బొత్స సత్యనారాయణ



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స



సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, వేదికపై కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

**గుర్ల:** ప్రజల వద్దకే పాలన అందిస్తున్నామని, సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ అన్నారు. మండలంలోని జమ్ము గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.17లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్ భవనాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కరోనా వల్ల దేశంలోని అన్ని రాష్ట్రాలు ఇబ్బందులుపడ్డాయని, కానీ అంతటి విపత్తులోనూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రతి ఒక్కరిరీ సంక్షేమ పథకాలు అందించి ఆర్థికంగా ఆదుకున్నామన్నారు. స్థానిక జమ్ము గ్రామానికే ఏడాదికి రూ.2.75 కోట్లను వివిధ పథకాల రూపంలో ప్రజలకు అందిస్తున్నా మన్నారు.గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులను 20 రోజుల్లో పూర్తి చేసి ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. సీసీ రోడ్లు, సొసైటీ భవనాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, గ్రామాలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ... ప్రతిపక్ష పార్టీ నాయకులు అభివృద్ధి జరగడం లేదని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. గత ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారని, తర్వాత రుణమాఫీ ఎందుకు చేయలేదో చెప్పాలని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. ఇప్పుడు ఉన్న ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనించాలని కోరారు.

**టీడీపీ వారి సెల్ఫీలు హాస్యాస్పదం**

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భోగాపురం ఎయిర్‌పోర్టు కోసం రెండు ఇటుకలు, రెండు రాళ్లు వేసి శంకుస్థాపన చేశారే తప్ప, ఎటువంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. టీడీపీ వారు అభివృద్ధి గురించి మాట్లాడుతూ సెల్ఫీలు తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాల తీసుకువచ్చి నిర్మాణ పనులు శరవేగంగా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, జమ్ము సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి, జమ్ముపేట సర్పంచ్ కురుమునెల్లి వరలక్ష్మి , ఎంపీడీఓ కల్యాణి, డీటీ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారు నాయుడు, కెంగువ మధుసూదనరావు, ఎంపీటీసీ కోటేశ్వరరావు, వరదా ఈశ్వరరావు, తోట తిరుపతి రావు, జమ్ము రామునాయుడు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులపై మంత్రి అసహనం**

జమ్ము ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సక్రమంగా బోధించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకు వచ్చారు. మంత్రి స్పందిస్తూ ఉపాధ్యాయులకు పనిచేయడం ఇష్టం లేకపోతే బదిలీపై వెళ్లిపోవాలని సూచించారు. మళ్లీ ఇటువంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ భానుప్రకాష్‌ను ఆదేశించారు. పని చేయని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటే ధర్నాలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. జమ్ము పాఠశాలకు వంటగది భవనాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## మెగా వైద్య శిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ శిరీష

**చీపురుపల్లిరూరల్:** మండలంలోని పి.కె.పాలవలసలో శ్రీకాకుళం జిల్లా రాగోలుకు చెందిన జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష ప్రారంభించారు. శిబిరానికి గ్రామంతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి వచ్చిన 250 మందికి వైద్యసిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 50 మందిని వివిధ శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు రెల్లి అప్పలనాయుడు, బైరెడ్డి లక్ష్మణరావు, సూరి సత్యం, వెంకటేష్, పాపారావు పాల్గొన్నారు.

## భూసర్వేను వేగవంతం చేయాలి



హద్దురాళ్లు పాతే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

**గుర్ల:** మండలంలో సమగ్రభూరీసర్వేను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశించారు. గుజ్జింగివలసలో నిర్వహిస్తున్న భూరీసర్వేను మంగళవారం ఆమె పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేయాలన్నారు. హద్దు రాళ్లు వేసే ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, మండల సర్వేయర్ శివ ఉన్నారు.

## సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు

**దత్తిరాజేరు:** ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే మండలం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, తదితర శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సంబంధిత అధికారులు సభకు చదివి వినిపించారు.గడసాం సర్పంచ్ నేతేటి దీపిక మాట్లాడుతూ తమ పంచాయతీలో ఉపాధి పనులపై ఫీల్డ్ అసిస్టెంట్ తమకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా చేస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. అలాగే మ్యుటేషన్ల, ఈ-క్రాప్‌కు సంబంధించి రెవెన్యూ సిబ్బంది ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను ఎంపీటీసీ వంగపండు కృష్ణమూర్తినాయుడు సభ దృష్టికి తెచ్చారు. జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధారగంగమ్మ చిన్న పండగ



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**శృంగవరపుకోట:** పట్టణ ప్రజల కొంగు బంగారం ధారగంగమ్మ తల్లి చిన్నపండగను పట్టణప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తుల దర్శనాల కోసం ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేసి, దేవాలయాన్ని పూలమాలలతో ప్రత్యే కంగా అలంకరించారు.అర్చకులు అగ్నిహోత్రం రాజగోపాలాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే మహిళలు అమ్మవారికి పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరలు, రవికెలు, గాజులు, పూసలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త మోపాడ గౌరినాయుడు దంపతులు తమ కుటుంబ సభ్యులతో వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

## రిజర్వేషన్ తీసేస్తామనడం తగదు

**వేపాడ:** ముస్లింలకు ఉన్న రిజర్వేషన్ తీసేస్తామని కేంద్రమంత్రి అమిత్‌షా బహిరంగ సభల్లో మాట్లాడం సమంజసం కాదని సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ అన్నారు. ఆకులసీతంపేట, సోంపురం, బొద్దాం, ఎస్.కోట సీతారాంపురం తదితర గ్రామాల్లో మంగళవారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం మేరకు రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, నిత్యావసరాల ధరలు, చమురు ధరలను నిత్యం పెంచేస్తున్నారని మండిపడ్డారు.


















# సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం




























● 'గడప గడపకు మనప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



పథకాల ద్వారా కలిగిన లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు


**కొత్తవలస:** ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధి సంతమార్కెట్ సమీపంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులకు కాలనీ వాసులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ కలిగిన లబ్ధిని వివరించారు. సీఎం జగన్ పాలనపై ప్రజలను ఆరా తీయగా..కాలనీవాసులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులందరికీ అందుతున్నాయని, అభివృద్ధి కార్యక్రమాలు బేషుగ్గా ఉన్నాయి అంటూ జేజేలు పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలను 98 శాతానికి పైగా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. పిల్లలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి చదువు మాత్రమే అన్నది ఆయన విశ్వాసమని, అందుకే విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. నాడు-నేడులో భాగంగా వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాల ద్వారా ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలు అమలు చేస్తున్నామని, పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తుంటే... ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం, సీఎంపై టీడీపీ తమ అనుకూల పత్రికలు, టీవీ చానెళ్ల ద్వారా నిత్యం దుష్ప్రచారం చేస్తూ, తప్పుడు కథనాలు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నిస్తున్నారని, వారి మాయమాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రారామస్వామి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, పార్టీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, గొరపల్లి రవికుమార్, పూసర్ల రఘు, పి.ఎస్.ఎన్.పాత్రుడు,రామకృష్ణ పాల్గొన్నారు.


# జగనన్నను ఆశీర్వదించండి



వీలుపర్తిలో పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

**వేపాడ:** అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రజలంతా ఆశీర్వదించాలని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు కోరారు. మండలంలోని వీలుపర్తి పంచాయతీలో మాజీ సర్పంచ్ గోకేడ సత్యంనాయుడు నేతృత్వంలో 'జగనన్నే మా భవిష్యత్- మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని సర్వే చేశారు. పథకాల కోసం ఎవరికైనా లంచాలు ఇవ్వాల్సి వచ్చిందా అని ప్రజలను ఆరా తీయగా.. తామెవరికీ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వకుండానే పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని ప్రజలు బదులిచ్చారు. వైఎస్సార్ సీపీ పాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరించి, ప్రజామద్దతు పుస్తకంలో నమోదు చేశారు. వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, నాయకులు వెంకటరావు, అప్పలనాయుడు, నర్సిబాబు, బొడ్డు శ్రీను, దొగ్గ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.




## పరిశుభ్రత పాటిద్దాం..

# మలేరియాను తరిమేద్దాం



శృంగవరపుకోట: ఎస్.కోటలో కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ

ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని శృంగవరపుకోట, గజపతినగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో మంగళవారం నిర్వహించారు. పీహెచ్‌సీల వైద్యాధికారుల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఇతర అధికారులు కలిసి అవగాహన ర్యాలీలు చేశారు. ఈసందర్భంగా అధికారులు, వైద్యులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల దోమలు వృద్ధి చెందవని, తద్వారా మలేరియా వ్యాప్తిని నియంత్రించవచ్చని అన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని, దోమతెరలు వాడాలని ప్రజలకు సూచించారు. వణుకుతో కూడిన జ్వరం, దగ్గు, కండరాల నొప్పి, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే మలేరియాగా పరిగణించి, తక్షణమే చికిత్స తీసుకోవాలని వివరించారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తవలస: వియ్యంపేటలో ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



గజపతినగరం: గజపతినగరంలో వైద్య సిబ్బంది ర్యాలీ



జామి: జామిలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి భాగ్యరేఖ, సిబ్బంది



బొండపల్లి: అవగాహన ర్యాలీలో మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది



గజపతినగరం రూరల్: మరుపల్లిలో నిర్వహించిన ర్యాలీలో వైద్యులు, సిబ్బంది




వేపాడ: వేపాడలో ర్యాలీ చేస్తున్న డాక్టర్ ధరణి, సిబ్బంది




దత్తిరాజేరు: కె.కొత్తవలసలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



వేపాడ: బొద్దాంలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి సతీష్‌కుమార్, సిబ్బంది




### అనధికార కట్టడానికి నోటీస్ అతికింపు

**గంట్యాడ:** మండలంలోని పెదవేమలి గ్రామంలో సచివాలయానికి చెందిన స్థలంలో అనధికారికంగా చేపడుతున్న భవన నిర్మాణాన్ని నిలిపివేయాలని సంబంధిత భవనానికి పంచాయతీ కార్యదర్శి ఎల్. తవుడు మంగళవారం నోటీస్ అతికించారు. సర్వే నంబర్ 57-పీలో గ్రామ సచివాలయానికి చెందిన భూమిలో కొందరు వ్యక్తులు అనధికారికంగా భవనాన్ని నిర్మిస్తున్నారని తెలిసి, నిర్మాణం ఆపివేయాలని మౌఖికంగా చెప్పినప్పటికీ పనులు ఆపకపోవడం వల్ల నోటీస్ అతికించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.ఈవిషయంపై ఎటువంటి హక్కులు, అభ్యంతరాలు ఉన్నా.. నోటీస్ అతికించిన మూడురోజుల్లో గ్రామ పంచాయతీవారికి ఆధారాలు సమర్పించి హక్కు నిర్ధారణ చేసుకోవాలని చెప్పారు.

# సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి దుర్గా ప్రసాద్

**బొండపల్లి:**

ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వాటి పరిష్కారానికి ప్రతీ సచివాలయ ఉద్యోగి కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.కె.వి.దుర్గా ప్రసాదరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సచివాయలయ ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది, ఏఎస్ఎంలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.


అలాగే సచివాలయాల్లో అందిస్తున్న ఈ-సర్వీసుల వివరాలను ఏ రోజుకారోజు రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీఓ ఏ.వేదవతి, ఏఎస్ఓ రాజేశ్వరి, దేవుపల్లి, బొండపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు సత్యనారాయణ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న డ్రోన్ సర్వే




రెండవ డ్రోన్‌ను డ్రైవ్‌కు సిద్ధం చేస్తున్న సర్వేసిబ్బంది

**శృంగవరపుకోట:** వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా ఎస్.కోటలో రెవెన్యూ అధికారులు సోమవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. సర్వే పనులను మంగళవారం కొనసాగించారు.మండల సర్వేయర్ పర్యవేక్షణలో సచివాలయ సర్వేయర్లు, వీఆర్ఓలు, వీఆర్ఏలు అంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. మార్కింగ్ సిద్ధం చేసుకున్న సర్వే సిబ్బంది మంగళవారం ఉదయం 2వ డ్రోన్‌తో సర్వే పనులు చేపట్టారు.










# ఘనంగా దుర్గాలమ్మ పండగ



దుర్గాలమ్మను దర్శించుకుంటున్న విశాఖ ఎంపీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు



దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు, పెద్దలు



అమ్మవార్ల వేషధారణతో నృత్యాలు



కోలాటం ఆడుతున్న మహిళలు



బాణా సంచా కాల్పులను రిమోట్ ద్వారా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

**వేపాడ:** మండలంలోని దబ్బిరాజుపేటలో గ్రామదేవత దుర్గాలమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత పండ గ నిర్వహించడంతో గ్రామంలో ప్రతీ ఇల్లు బంధు వులతో సందడిగా మారింది. గత నెలరోజులుగా అనుబంధ అమ్మవార్ల పండగ నిర్వహించారు. ఈనెల 16 నుంచి దుర్గాలమ్మ పండగ ప్రారంభమైంది. మంగళవారం అనుపోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని దర్శించుకున్న విశాఖపట్నం ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాణి దంపతులు, ఎంపీపీ సత్యవంతుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దర్శించుకున్నారు.

